క్లుప్తంగా

మహిళలకు 'బండారు' క్షమాపణ చెప్పాలి


ముద్దాల అను

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్త్రీలను ఎక్కడ గౌరవిస్తారో అక్కడ దేవతలు పూజింపబడతారన్న సంప్రదాయాలకు విరుద్ధంగా టీడీపీ నాయకులు మహిళలను అగౌరపరుస్తున్నారన్నారు. ఇటీవల మంత్రి రోజాపై బండారు నీచమైన వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పకపోతే బండారు ఇంటిని ముట్టడిస్తామని ముద్దాల అను హెచ్చరించారు. టీడీపీకి పతనం దగ్గరలోనే ఉందన్నారు.

నేడు డాక్ సేవక్స్ యూనియన్ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం డివిజన్ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ద్వైవార్షిక సమావేశాన్ని జయప్రదం చేయాలని డివిజన్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి పి.భూలోకం శనివారం పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పాలు పెరుగు వర్తకుల సంఘ కమ్యూనిటీ హాలులో జరిగే ఈ సమావేశానికి సంఘ సభ్యులంతా హాజరు కావాలన్నారు. దీనికి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


కడియపులంకలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం, వాహనం

కడియం: కడియపులంక స్కూల్ వీధిలోని ఓ ఇంట్లో బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ సిబ్బంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది దాడి చేశారు. అక్కడ 37 సంచుల్లో నిల్వ ఉంచిన 1,806 కిలోల బియ్యాన్ని, టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం అక్రమంగా నిల్వ చేసిన పెన్నాడ దొరబాబుపై 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యం విలువ రూ. 1,72,240 ఉంటుందని అధికారులు తెలిపారు. రేషన్ కార్డుదారుల నుంచి కిలో బియ్యాన్ని రూ.18 చొప్పున కొనుగోలు చేసి, ఇటుక బట్టీ కార్మికులకు రూ.20కు దొరబాబు అమ్ముతున్నాడన్నారు. పీడీఎస్ బియ్యాన్ని ఎవరైనా అమ్మినా, కొన్నా చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది, సివిల్ సప్లయిస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

ధవళేశ్వరం: స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్‌లో దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరిశీలించారు. నాగేశ్వర్‌కు విగ్రహ ఏర్పాటుపై వివరాలను జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు వివరించారు. నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), శ్రీరంగం బాలరాజు, గరగ శ్రీనివాసరావు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, చాటకాల చంటి, మెండా రాజేష్, బత్రి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కమిషనర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కమిషనర్ కార్యాలయంలో శ్రీవెంకటేశ్వర జనరల్ మార్కెట్, షెల్టాన్ హోటల్ రోడ్డులో స్థలాలు కోల్పోనున్న ఇళ్ల యజమానులు, రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, రుడా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ జరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోనున్న అందరికీ ప్రభుత్వ నిర్దేశాల మేరకు టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నారు. ఇప్పటికే షెల్టాన్ హోటల్ రోడ్డులోని వారికి టీడీఆర్ బాండ్లు అందజేశామన్నారు. అ.దీకృత లేఅవుట్‌లోని యజమానులకు మాత్రమే వీటిని ఇస్తామన్నారు. శ్రీవెంకటేశ్వర జనరల్ మార్కెట్ ప్రాంతంలో ఎంత స్థలం సేకరించాలి, ఎంతమందికి బాండ్లు ఇవ్వాలో సర్వే చేసి నాలుగు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆర్డీడీ చైత్రవర్షిణి, రుడా వైస్ చైర్మన్ బాలస్వామి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, రుడా ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, అర్బన్ తహసీల్దార్ సుస్వాగతం పాల్గొన్నారు.

కార్మికులకు వరం.. ఈ-శ్రమ్ కార్డులు

- ఉచితంగా నమోదుకు ప్రణాళిక
- దేశంలో ఎక్కడైనా లబ్ధి పొందేలా చర్యలు


ఈ-శ్రమ్ కార్డును అందిస్తున్న కార్మిక శాఖ అధికారి విజయ్‌ప్రకాష్

సీటీఆర్ఐ: కార్మికుల సామాజిక భద్రతకు ఈ-శ్రమ్ పోర్టల్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. కరోనా ఆపత్కాలంలో వలస, అసంఘటిత కార్మికుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా అసంఘటిత కార్మికుల గుర్తింపునకు రంగం సిద్ధమైంది. ఆధార్ కార్డు తరహాలో దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం చేకూరేలా యూఏఎన్ (యూనివర్సల్ అకౌంట్ నంబర్)తో కూడిన ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో కార్మిక శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో అనధికారికంగా 5,45,810 మందికి పైగా అసంఘటిత కార్మికులు ఉన్నారు. ఇప్పటి వరకూ గుర్తించిన 3,18,014 మందికి గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఇందులో భాగంగా కొన్ని యూనియన్ల ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ కార్డుల నమోదుకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్మికులకు ఈ కార్డుల ప్రయోజనం తెలియజేసి నమోదుకు సహకరిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలోనే సుమారు 25 వేల మంది కార్మికులు ఉన్నట్లు అంచనా. ఇందులో ఇప్పటి వరకూ సుమారు 10 వేలకు పైగా కార్మికులు ఈ-శ్రమ్ కార్డులకు నమోదు చేయించుకున్నారు.

అర్హులు ఎవరంటే..

16 నుంచి 59 ఏళ్ల వయసు కలిగి ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు అవకాశం లేని భవన నిర్మాణ, వలస కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలురైతులు, మత్స్యకారులు, పశుపోషణలో నిమగ్నమైన వారు, బీడీ రోలింగ్, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీలు, రాతి క్వారీల్లో కార్మికులు, సామిల్లు, సరకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, వార్తపత్రిక విక్రేతలు, రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు, ఆశ, అంగన్‌వాడీ కార్మికులు తదితరులు అర్హులు.

ఎక్కడ నమోదు చేస్తారంటే..

ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు (ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సహా), బ్యాంకు, ఆధార్ కార్డుతో లింకేజీ కలిగిన ఫోన్ నంబర్ ఉండాలి. సమీప సీఎస్‌సీ సెంటర్లు, పోస్టాఫీస్, గ్రామ/వార్డు సచివాలయాల్లో నమోదు చేస్తారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్డులు పొందిన అసంఘటిత కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతారు. ఇది వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను అందించడానికి ఉపయోగపడుతుంది. ఆర్థిక సహాయం నేరుగా వారి అకౌంట్‌కు జమ చేస్తారు.

వలస జీవులకూ..

పొట్ట చేతపట్టుకుని వేరే రాష్ట్రాల నుంచి ఇక్కడికి పనుల కోసం వచ్చిన వారికి ఒక్కోసారి పనిలేక పస్తులుండాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు వలస కార్మికులకూ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారు. వేరే రాష్ట్రం వారైనా ఇక్కడ దరఖాస్తు చేసుకుంటే రేషన్ కార్డు ఇస్తున్నారు.

నమోదు చేసుకోవాలి



యూఏఎన్ గుర్తింపు కార్డుల కోసం లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. దీని ద్వారా అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తాం. కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఇది అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత, ఆర్థిక సహాయం కోసం ఉపయోగపడుతుంది.

–బీఎస్ఎం వలీ, జిల్లా సహాయ కార్మిక కమిషనర్

రేషన్ కార్డుల జారీ



వలస కూలీలు ఈ-శ్రమ్ పోర్టల్‌లో వారి పేర్లు నమోదు చేసుకుని, రేషన్ కార్డులు లేనివారు సమీపంలోని గ్రామ సచివాలయంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కూలీల డేటాను గుర్తించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

–డాక్టర్ కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

అల్పాహారం పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: చల్లగాలి సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మెజీషియన్, చల్లగాలి సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ చైర్మన్ చల్లగాలి శ్రీనివాస్‌వర్మ తమ సంస్థ ద్వారా పేదలకు వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం శ్రీనివాస్‌వర్మ, కల్యాణి దంపతులు తమ కుమారుడు, దివంగత ఇంజినీరింగ్ విద్యార్థి శోభిత్‌వర్మ వర్ధంతి సందర్భంగా బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో 46 మందికి, పలువురు పేదలకు, క్వారీ సెంటర్ ప్రియదర్శిని దివ్యాంగుల పాఠశాలలో సుమారు 120 మందికి శనివారం ఉదయం అల్పాహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతేడాది విధి వక్రించి తన కుమారుడు మృతి చెందాడని, శోభిత్ స్మృతిలో తమ వంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సేవా సంస్థ సభ్యులు అక్షర, రుత్విక్‌వర్మ, ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని సీతంపేటలో మద్యం విక్రయిస్తున్న కర్రి దుర్గారావును శనివారం అరెస్టు చేసి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, చందన నాగేశ్వర్
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన


వాంబే కాలనీలో వైద్య శిబిరంలో ఎంపీ సుభాష్ చంద్రబోస్, చందన నాగేశ్వర్, దినేష్‌కుమార్


మాధవరాయుడుపాలెం చైతన్యనగర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు


కోలమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్, పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం స్థానిక ఆవ వాంబే కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారితో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ఏర్పాటైన హెల్ప్‌డెస్క్, ల్యాబ్ టెస్టింగ్ సెంటర్, స్పాట్ రిజిస్ట్రేషన్, ఈసీజీ, మందుల పంపిణీ కౌంటర్లను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిల్లి సుభాష్‌చంద్రబోస్, చందన నాగేశ్వర్ మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా పేదలందరికీ ఉచిత వైద్య సేవలు అందించాలనే ఆలోచనతో సీఎం జగన్ ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ యూపీహెచ్‌సీ వైద్యులతో పాటు, స్పెషలిస్టులు శిబిరంలో వైద్య సేవలు అందించారన్నారు. 441 మందికి వైద్య సేవలందించగా, 27 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు నాగవేణి, వరలక్ష్మి నేతృత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎంహెచ్‌వో వినూత్న నేతృత్వంలో వైద్య నిపుణులు పవన్ కిశోర్, ప్రజ్ఞరాజ్, కె.దిలీప్, ఎల్.ప్రసన్న, యూపీహెచ్‌సీ వైద్యులు ఎస్ఆర్ అశోక్‌చంద్ర, నీలిమ, కె.ఆనంద్‌లు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

471 మందికి వైద్య పరీక్షలు

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్యనగర్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 471 మందికి డాక్టర్ నాగసాయిమౌర్య ఆధ్వర్యంలో వైద్యులు మణిజ్యోత్స్న, జెస్సీ సుప్రియ, స్వరూప తదితరులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 12 మందికి కళ్లజోళ్లు అందించారు. ఏడుగురు గర్భిణులకు, ఇద్దరు రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు పరీక్షలు చేసి పలు సూచనలు ఇచ్చారు. ఆర్థోపెడిక్, జనరల్, ఆప్తమాలజీ తదితర విభాగాలకు సంబంధించి టెస్టులు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తమ చందన చేయూత ట్రస్టు ద్వారా వైద్య శిబిరం వద్దకు విచ్చేసిన వారికి భోజన సదుపాయం కల్పించారు. స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

697 మందికి..

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు-4 సచివాలయం పరిధి ఎంపీపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఇందులో 697 మందికి వైద్య సేవలు అందించగా, 24 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సచివాలయ కన్వీనర్లతో ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ మేరీ నేతృత్వంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ తాడి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణు, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, కొంతమూరు సొసైటీ త్రీమెన్ కమిటీ సభ్యుడు పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పిన్నమరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి


కాలువను పరిశీలిస్తున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక 9వ డివిజన్ కోకా భాస్కరమ్మనగర్, బర్మా కాలనీ, వెంకటేశ్వరనగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలసి పర్యటించారు. బర్మా కాలనీలో డ్రైన్ నిర్మాణం నిమిత్తం తవ్విన మట్టిని చూసి సత్వరమే సరిచేయాలని ఆయన అన్నారు. పార్కులో జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. బర్మా కాలనీ తదితర ప్రాంతాల్లో కుళాయిల నుంచి నీరు వేగంగా రావడం లేదని స్థానికులు చెప్పడంతో సంబంధిత వాటర్ వర్క్స్ డీఈతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. సీసీ డ్రైన్లను వెడల్పు చేసి నిర్మించాలని, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తీయించాలని అన్నారు. ఈ పర్యటనలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి దాసి వెంకట్రావు, స్థానిక పెద్దలు, నాయకులు కంచుమర్తి చంటి, పైడా వాసు, తగరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ముందుకు సాగాలి


బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న పిల్లి సుభాష్‌చంద్రబోస్, చిత్రంలో నాగేశ్వర్

ధవళేశ్వరం: బీసీలంతా సంఘటితంగా ముందుకు సాగాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం 1, 3, 5 పరిధిలో శనివారం బీసీల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. దీనికి చంద్రబోస్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను మాట్లాడుతూ బీసీల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. నాయకులు పెయ్యల రాజేష్, ముత్యాల పోసికుమార్, దేవులపల్లి సరితారాణి, తలారి వరప్రసాద్, కొత్తపల్లి శివ, దాసరి ధర్మ, షట్టర్ బాషా, సాధనాల చంద్రశేఖర్ (శివ), గరగ శ్రీను, డాక్టర్ చొల్లంగి సత్యగిరి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకువెళ్తున్న భారత్


ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీల్లో విజేతలతో ఎంపీ సుభాష్ చంద్రబోస్, ఇస్రో శాస్త్రవేత్తలు

- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ దూసుకు వెళ్తోందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఈ రంగంలో మన దేశం అభివృద్ధి సాధిస్తేనే ప్రపంచంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఇస్రో ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇస్రో కార్యకలాపాలు, రాకెట్ నమూనాల ప్రదర్శనను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ, గోదావరి జిల్లాలకు చెందిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇలాంటి జాతి రత్నాలను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ప్రస్తుత ప్రధాని వరకూ అందరూ అంతరిక్ష రంగం అభివృద్ధికి కృషి చేశారని బోస్ అన్నారు. ముఖ్యంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేసిన కృషి, ప్రస్తుత ప్రధాని మోదీ అందిస్తున్న సహకారం అద్వితీయమని చెప్పారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ప్రధాని మోదీ పార్లమెంట్‌లో ఆనందం వ్యక్తం చేస్తూ, ఇస్రో పరిశోధనలకు ఎటువంటి సహకారం కావాలన్నా నేరుగా తనను సంప్రదించాలని సూచించారని గుర్తు చేశారు. ఒకప్పుడు రష్యా సహకారంతో రాకెట్ ప్రయోగాలు చేసిన మనం.. ఇప్పుడు సొంత సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు వేసే స్థాయికి ఎదిగామని చెప్పారు. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు నమోదు చేస్తుందని బోస్ ఆకాంక్షించారు.

రికార్డులు అప్‌డేట్ చేయాలి


మెరకవీధి పాఠశాలలో తనిఖీ చేస్తున్న అర్బన్ ఎంఈఓ రమారజిని

కంబాలచెరువు: పాఠశాలల్లో నాడు-నేడు పనుల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అర్బన్ ఎంఈఓ-2 రమారజిని హెచ్ఎంలకు సూచించారు. శనివారం స్థానిక మెరక వీధి ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రమారజిని మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న సూచనలను ఎప్పటికప్పుడు అనుసరిస్తూ నాడు- నేడు రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఫార్మేటివ్-2 పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో 10వ తేదీ లోపు మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. అర్బన్ పరిధిలోని పాఠశాలలను జిల్లా న్యాయమూర్తి ప్రత్యూష కుమారి విజిట్ చేసి అవగాహనా తరగతులు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. బాలికల వేధింపులపై అవగాహన నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్లు ఎక్కడా స్కూళ్లలో లేకపోవడంతో వాటిని వెంటనే ఏర్పాటు చేయమని ఆదేశించారన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ తనిఖీలున్న నేపథ్యంలో వెంటనే ప్రతి పాఠశాలలో ఆ పోస్టర్లు అతికించాలన్నారు. సీఆర్పీ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువగళం వలంటీర్ల విడుదల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి 39 మంది యువగళం వలంటీర్లు శనివారం బెయిల్‌పై విడుదలయ్యారు. భీమవరంలోని ఉంగుటూరులో జరిగిన టీడీపీ అల్లర్లలో 39 మంది యువగళం వలంటీర్లను గత నెల 6న పోలీసులు అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. బెయిల్‌పై వారు విడుదలయ్యారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ధవళేశ్వరం: స్థానిక బ్యారేజీ కాలనీ వద్ద సీతారామాలయంలో నవమి తిథిని పురస్కరించుకుని శనివారం సీతారాముల దివ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను తిలకించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.